
# విమాన చార్జీలకు రెక్కలు

## ఈ పండుగ సీజన్‌లో భారీగా పెరిగిన టికెట్ ధరలు

## ముందస్తు బుకింగ్‌లతో ఒక్కసారిగా డిమాండ్

## ముంబై-హైదరాబాద్ రూట్‌లో 21 శాతం పైకి

## హైదరాబాద్-తిరువనంతపురం మధ్య 30 శాతం అప్



న్యూఢిల్లీ, ఆగస్టు 19: విమాన చార్జీలు పెరుగుతున్నాయి. రాబోయే పండుగ సీజన్ దృష్ట్యా ఇప్పటికే ఏకంగా 25 శాతం వరకు టికెట్ ధరలను వివిధ విమానయాన సంస్థలు పెంచేశాయి. ఒక్కసారిగా పెరిగిన ముందస్తు బుకింగ్‌లే కారణం. ఈ క్రమంలోనే వన్-వే టికెట్ సగటు ధర దీపావళికి ఆయా ప్రధాన మార్గాల్లో 10 నుంచి 15 శాతం వరకు పెరిగింది. ఇక ఓనమ్ పండుగకైతే కేరళ వెళ్లేవారు 20 నుంచి 25 శాతందాకా అధిక చార్జీలను చెల్లించాల్సిన పరిస్థితి వస్తున్నది. ట్రావెల్ పోర్టల్ ఇక్సిగో వివరాల ప్రకారం ఢిల్లీ-చెన్నై నాన్‌స్టాప్ విమానం ఎకానమీ క్లాస్ టిక్కెట్ సగటు ధర అక్టోబర్ 30-నవంబర్ 5 మధ్య 25 శాతం ఎగిసి రూ.7,618గా ఉంటున్నది. గత ఏడాది నవంబర్ 10-16 నడుమ రూ.5,713గానే ఉండటం గమనార్హం. అలాగే ముంబై-హైదరాబాద్ రూట్‌లో టికెట్ ధర 21 శాతం ఎగబాకి రూ.5,162 పలుకుతున్నది. ఢిల్లీ-గోవా, ఢిల్లీ-అహ్మదాబాద్ మార్గాల్లో ధరలు రూ.5,999, రూ.4,930గా ఉంటున్నాయి. నిరుడుతో చూస్తే 19 శాతం ఎక్కువ. ఇతర మార్గాల్లోనూ టికెట్ రేట్లు 1 నుంచి 16 శాతం మేర పెరిగిపోయాయని చెప్తున్నారు. గత ఏడాది ఆగస్టు 20-29 మధ్య ఓనమ్ పండుగ జరిగినప్పటితో చూస్తే ఈ ఏడాది సెప్టెంబర్ 6-15 మధ్య ఓనమ్ సమయంలో హైదరాబాద్-తిరువనంతపురం విమాన టికెట్ ధర 30 శాతం ఎగిసి రూ.4,102కి చేరింది. ముంబై-కాలీకట్ ఫ్లైట్ చార్జీ కూడా ఇంతే స్థాయిలో పెరిగి రూ.4,448గా నమోదైంది.

### తగ్గిన బెంగళూరు-హైదరాబాద్ చార్జీ

మరోవైపు కొన్ని మార్గాల్లో విమాన చార్జీలు కనిష్టంగా 1 శాతం, గరిష్ఠంగా 27 శాతం తగ్గాయి. వాటిలో అత్యధికంగా ముంబై-అహ్మదాబాద్ టికెట్ ధర 27 శాతం క్షీణించి రూ.2,508గా ఉన్నది. అలాగే ముంబై-ఉదయ్‌పూర్ ఫ్లైట్ చార్జీ 25 శాతం పడిపోయి రూ.4,890కి దిగింది. బెంగళూరు-హైదరాబాద్ విమాన చార్జీ 23 శాతం తగ్గి రూ.3,383కు, ముంబై-జమ్ము టికెట్ రేటు 21 శాతం పతనమై రూ.7,826కు వచ్చాయి.

*ఢిల్లీ-చెన్నై, ముంబై-బెంగళూరు, ఢిల్లీ-హైదరాబాద్ వంటి రద్దీ మార్గాల్లో వన్-వే చార్జీలు సగటున రూ.4,000-5,000 మధ్య ఉన్నాయి. పండుగల దృష్ట్యా నిరుడుతో పోల్చితే 10-15 శాతం పెరిగాయి. ఓనమ్ పండుగకైతే ఈసారి కేరళ వెళ్లేవారు చాలా చాలా ఎక్కువగా చెల్లించాల్సి వస్తున్నది. సెప్టెంబర్ రెండో వారంలో చాలామంది టిక్కెట్ బుక్ చేసుకుంటున్నారు. నిరుడుతో పోల్చితే రెట్టింపైంది. కొచ్చిన్, కాలీకట్, తిరువనంతపురం మార్గాల్లో విమాన చార్జీలు 20-25 శాతం ఎగిశాయి.*

*-రజ్నీశ్ కుమార్, ఇక్సిగో గ్రూప్ కో-సీఈవో*

రాబోయే పండుగ సీజన్‌లోనైతే కొన్ని రూట్లలో టికెట్ ధరలు దాదాపు 6-35 శాతం పడిపోవచ్చంటున్నారు. ఈ రూట్లలో డిమాండ్ పెంచేందుకేనని చెప్తున్నారు.

### విమాన ప్రయాణీకుల రద్దీ..

*ఈ ఏడాది జూలైలో గత ఏడాదితో పోల్చితే దేశీయంగా విమాన ప్రయాణీకుల రద్దీ 7.3 శాతం పెరిగింది. 1.29 కోట్లకు పైగా విమానాలెక్కారు. అయితే ఈ ఏడాది జూన్‌తో చూస్తే మాత్రం జూలైలో ప్రయాణీకులు తగ్గారు. నాడు 1.32 కోట్ల ప్రయాణీకులు నమోదయ్యారు. ఇక ఇండిగో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. మార్కెట్ వాటా జూలైలో 62 శాతానికి ఎగిసింది. ఎయిర్ ఇండియా 14.3 శాతానికి తగ్గింది. ఆకాశ ఎయిర్ 4.7 శాతానికి, ఏఐఎక్స్ కనెక్ట్ 4.5 శాతానికి, స్పైస్‌జెట్ 3.1 శాతానికి, అలయన్స్ ఎయిర్ 0.9 శాతానికే పరిమితమయ్యాయి. అయితే విస్తారా 10 శాతానికి పెరిగిందని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) తెలిపింది. ఇక ఈ ఏడాది జనవరి-జూలైలో దేశీయ ఎయిర్‌లైన్స్‌ల్లో ప్రయాణికుల సంఖ్య 92.33 కోట్లుగా ఉన్నది. పోయినసారి 88.19 కోట్లే. జూలైలో విమానాల ఆలస్యంతో 3 లక్షలకుపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.*



## డిసెంబర్ నాటికి అరబిందో చైనా ప్లాంట్ రెడీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19: చైనాలో ఏర్పాటు చేసిన ఫార్మా యూనిట్‌ను ఈ ఏడాది చివర్లో ప్రారంభించనున్నట్లు, పూర్తి స్థాయిలో మాత్రం వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి అందుబాటులోకి రానున్నట్లు అరబిందో ఫార్మా సీఎఫ్‌వో సంతానం సుబ్రమణియన్ తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన పెన్-జీ ప్లాంట్‌కు పీఎల్‌ఐ స్కీం కింద అనుమతి లభించిందని, ప్రతియేటా ఈ యూనిట్‌లో 15 వేల టన్నుల ఔషధాలు ఉత్పత్తి కానున్నయన్నారు. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర సర్కార్ పీఎల్‌ఐ స్కీంను ప్రవేశపెట్టింది. ఈ స్కీం కింద ఎంపికైన ప్లాంట్లకు పలు రాయితీలు లభించనున్నాయి. అమెరికాలో ఔషధాల ధరలు తగ్గుముఖం పట్టడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సంస్థ ఆదాయ, లాభాలపై ప్రభావం చూపుతున్నదని, ఇదే ట్రెండ్ భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశాలున్నాయన్నారు. గడిచిన త్రైమాసికానికిగాను రూ.7,567 కోట్ల ఆదాయంపై రూ.919 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది.

## 'డిపాజిట్లను ఆకర్షించండి'



న్యూఢిల్లీ, ఆగస్టు 19: డిపాజిట్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా బ్యాంకులు తీవ్రంగా కృషి చేయాలని ప్రభుత్వరంగ బ్యాంకుల అధిపతులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. బ్యాంకుల పనితీరుపై సోమవారం ఢిల్లీలో ఆమె ప్రత్యేకంగా సమీక్షించారు. గడిచిన కొన్ని నెలలుగా రుణ వితరణ కంటే డిపాజిట్లలో వృద్ధి 300-400 బేసిక్ పాయింట్లు తక్కువగా నమోదైందని, ఈ రెండింటి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి తీవ్రంగా కృషి చేయాలని ఆమె సూచించారు. ఖాతాదారులతో సత్సంబంధాలు కలిగివుండాలని, ప్రధానంగా గ్రామీణ, చిన్న స్థాయి పట్టణాల్లో ఉండేవారిని లక్ష్యంగా చేసుకొని డిపాజిట్లు ప్రకటించాలని, వీరు అత్యధికంగా డిపాజిట్ చేసే అవకాశాలుంటాయని పీఎస్‌బీలకు మంత్రి సూచించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో పీఎస్‌బీలు రూ.1.45 లక్షల కోట్ల లాభాలను ఆర్జించాయి.



# సిట్రాయిన్ నయా కారు

### రూ.7.99-13.62 లక్షల ధరల శ్రేణిలో..

చెన్నై, ఆగస్టు 19: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ సిట్రాయిన్..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను పరిచయం చేసింది. ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో బాసల్ట్ పేరుతో నయా కారును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.7.99 లక్షల నుంచి రూ.13.62 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నది. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. ఈ కారుపై రెండేండ్లు లేదా 40 వేల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది. దేశవ్యాప్తంగా ఉన్న 85 షోరూంలలో ఈ కారు ముందస్తు బుకింగ్‌లు ఆరంభించిన సంస్థ..వచ్చే నెల తొలి వారం నుంచి డెలివరీ చేయనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 1.2 లీటర్ జెన్ 3 ప్యూర్‌టెక్ 110 టర్బో ఇంజిన్‌తో తయారైన ఈ కారు 6 స్పీడ్ ఆటోమేటిక్, మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో తయారు చేసింది. భద్రత ప్రమాణాలు మెరుగుపర్చడంలో భాగంగా ఈ కారులో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను నెలకొల్పింది.

KAYNES TECHNOLOGY

## 23న కేన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్ ప్రారంభం

### గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుదిరిన ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ): ప్రముఖ సెమీ కండక్టర్ల తయారీ సంస్థ కేన్స్ టెక్నాలజీ..తెలంగాణలో ఏర్పాటు చేయతలపెట్టిన అడ్వాన్స్ ఎలక్ట్రానిక్ యూనిట్(ఏఈయూ) తరలిపోతున్నదన్న వార్తలను కంపెనీ సీఈవో రఘు ఫణికర్ కొట్టిపారేశారు. కొంగర్‌కలాన్ వద్ద రూ.2,800 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న సెమీకండక్టర్ల తయారీ యూనిట్‌ను ఈ నెల 23న ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించినట్లు చెప్పారు. ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్టింగ్(ఓఎస్ఏటీ) యూనిట్ ఇండియన్ సెమీకండక్టర్ మిషన్ పరిశీలనలో ఉన్నదని, ఐఎస్ఎం అనుమతి రాగానే ఈ యూనిట్ కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఫణికర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ భారీ పెట్టుబడితో రాష్ట్రంలో సెమీకండక్టర్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకుగాను గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. గతేడాది అక్టోబర్‌లో రంగారెడ్డి జిల్లా కొంగర్‌కలాన్‌లో యూనిట్ నిర్మాణ పనులు కూడా ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గత మార్చిలో సంస్థ నిర్మాణ పనులను అర్ధాంతంగా నిలిపివేసింది. దీంతో ఈ యూనిట్ గుజరాత్‌కు తరలివెళ్లనున్నట్లు అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. గుజరాత్‌లోని సనంద్ వద్ద రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ఓఎస్ఏటీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు, కొంగర్‌కలాన్ వద్ద చేపట్టిన ప్రాజెక్టును ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ సర్వీసెస్(ఈఎంఎస్) యూనిట్‌గా మార్చివేస్తున్నట్లు వార్తలు వచ్చాయి.

# అదానీ చేతికి రిలయన్స్ పవర్స్ ప్లాంట్!



### ఒప్పందం విలువ రూ.3 వేల కోట్ల స్థాయిలో..

న్యూఢిల్లీ, ఆగస్టు 19: దేశీయ కుబేరుల్లో ఒకరైన గౌతమ్ అదానీ మరో విద్యుత్ ప్లాంట్‌ను చేజిక్కించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు విద్యుత్ యూనిట్లను కైవసం చేసుకున్న ఆయన..తాజాగా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్స్ ప్లాంట్‌ను కొనుగోలు చేసేయోచనలో ఉన్నారు. ఒప్పందం విలువ రూ.2,400 కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. రుణాలు చెల్లింపులు విఫలంకావడంతో రిలయన్స్ పవర్‌కు చెందిన 600 మెగావాట్ల బుతిబోరి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రస్తుతం ఎన్‌సీఎల్‌టీ వద్ద ఉన్నది. విదర్భ ఇండస్ట్రీస్ పవర్ లిమిటెడ్ పేరుతో నాగపూర్ వద్ద ఉన్న ఈ విద్యుత్ ప్లాంట్ కొనుగోలుకు సంబంధించి సీఎఫ్ఎం అసెట్ రీకన్‌స్ట్రక్షన్‌తో అదానీ పవర్ సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రముఖ మీడియా సంస్థ మింట్ ఒక కథనాన్ని ప్రచురించింది. ఒక్కో మెగావాట్ ధర రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో ఈ ప్రాజెక్టు విలువ రూ.6 వేల కోట్ల స్థాయిలో ఉండగా, ప్రస్తుతం ఈ ప్లాంట్ మూతపడటంతో దీని విలువ సగానికి సగం పడిపోయింది.

### వెనక్కి తగ్గిన సజ్జన్ జిందాల్

దేశీయ వ్యాపారవేత్త సజ్జన్ జిందాల్ కూడా రిలయన్స్ పవర్‌కు చెందిన ఈ ప్లాంట్‌ను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపినప్పటికీ ప్రస్తుతం వెనుకంజవేశారు. కంపెనీ విలువ అత్యధికంగా ఉండటం, నిర్వహణ సమస్యలు అధికంగా ఉండటంతో ఆయన వెనక్కి తగ్గినట్లు తెలుస్తున్నది. దీంతో ఈ యూనిట్ రేసులోకి మళ్లీ అదానీ వచ్చారు. ముంబైలో విద్యుత్‌ను సరఫరా చేయడానికి గతంలో రిలయన్స్ పవర్ ఈ విద్యుత్ ప్లాంట్‌నే వినియోగించేది. ఆ తర్వాతి క్రమంలో ముంబై డిస్ట్రిబ్యూషన్ బిజినెస్‌ను అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్ చేతికి వెళ్లడంతో ఈ యూనిట్ నిరూపయోగంగా మారిపోయింది. దేశవ్యాప్తంగా ఒకవైపు విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతుండటంతో అదానీ గ్రూపు తన థర్మల్ విద్యుత్ కెపాసిటీని పెంచుకునే పనిలో పడింది. దీంట్లో భాగంగా మూతపడిన, ఎన్‌సీఎల్‌టీ కింద ఉన్న విద్యుత్ ప్లాంట్లను చౌకగా కొనుగోలు చేయడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది.

## సెబీ చీఫ్‌పై మళ్లీ ఆరోపణలు!

న్యూఢిల్లీ, ఆగస్టు 19: అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై మరోసారి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికన్ ప్రైవే ట్ ఈక్విటీ బ్లాక్‌స్టోన్‌తో సంబంధాలు కలిగివున్నట్లు ది మార్నింగ్ కంటెక్స్ తన కథనంలో వెల్లడించింది. దేశీయ కార్పొరేట్ సంస్థల్లో మెజార్టీ వాటాను కొనుగోలు చేయడానికి పరోక్షంగా బ్లాక్‌స్టోన్‌కు సహాయ సహకారాలు అందించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తన కథనంలో పేర్కొంది. బ్లాక్‌స్టోన్ సంస్థ గడిచిన నాలుగేండ్లలో భారత్‌లో భారీగా పెట్టుబడులు పెట్టడంతోపాటు పలు కంపెనీల్లో ప్రమోటర్‌గా మారింది. ప్రైవేట్ పెట్టుబడులు అనుమతించడానికి నియంత్రణ మండళ్లు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, బ్లాక్‌స్టోన్ పెట్టుబడులపై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండానే అనుమతినిచ్చినట్లు ఆరోపిస్తున్నది.

## ధరలు తగ్గుతున్నాయ్: ఆర్బీఐ

ముంబై, ఆగస్టు 19: ధరలు తగ్గుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అంటున్నది. ఈ నెలలో తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, వంటనూనెల ధరలు బాగా తగ్గినట్టు తాము గుర్తించామని 'స్టేట్ ఆఫ్ ది ఎకానమీ' పేరిట సోమవారం విడుదల చేసిన బులెటిన్‌లో ఆర్బీఐ పేర్కొన్నది. గత నెల జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.5 శాతానికి దిగొచ్చిన విషయం తెలిసిందే. అంతకుముందు నెల జూన్‌లో 5.1 శాతంగా ఉన్నది. టోకు ద్రవ్యోల్బణం కూడా తగ్గింది. ఈ క్రమంలో ఆగస్టులోనూ ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గబోతున్నాయన్నట్టు ఆర్బీఐ సంకేతాలివ్వడం ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. దీంతో ఇది ఇలాగే కొనసాగితే అక్టోబర్ నెలలో జరిపే ద్రవ్యసమీక్షలోనైనా ఆర్బీఐ వడ్డీరేట్లకు కోతపెట్టే అవకాశాలుంటాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగానే ఉంచుతున్నది.

# నేటి నుంచి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

### కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 19 : ఓటరు జాబితా సవరణ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఓటరు జాబితా నవీకరణపై తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ సమ్మరి రివిజన్ 2024లో భాగంగా ఓటరు జాబితా తయారు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పుడున్న జాబితాలో పేర్లు ఉన్నవారు శాశ్వతంగా ఎక్కడికైనా వెళ్లిపోయారా, చనిపోయారా, పేర్లలో తప్పులు ఉన్నాయా అనే అంశాలను బీఎల్వోలు తెలుసుకునేలా చూడాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండి ఓటరు జాబితాలో పేరు లేకుంటే వారి నుంచి దరఖాస్తు స్వీకరించాలని సూచించారు. ఈ ప్రక్రియలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఓటరు జాబితా ముసాయిదాను అక్టోబర్ 29 న ప్రకటించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 10 వరకు ఇంటింటా సర్వే పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 1500 మంది ఓటర్ల కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉంటే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ మండలాల తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కామారెడ్డి, ఆగస్టు 19 : ఉపాధ్యాయ సంఘ భవనాలకు కేటాయించిన నిధుల ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆదివారం జిల్లా కేంద్రంలో పీఆర్టీయూ సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి తమ ఎమ్మెల్సీ నిధుల నుంచి భిక్కనూర్ పీఆర్టీయూ భవనానికి రూ.10 లక్షలు, ఎల్లారెడ్డి పీఆర్టీయూ భవనానికి రూ.10 లక్షలు, కామారెడ్డి పీఆర్టీయూ భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించారు. అయితే ఉపాధ్యాయుల పక్షాన గెలిచిన ఎమ్మెల్సీ.. ప్రభుత్వ నిధులను యూనియన్ భవనాలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. బడుగు బలహీనవర్గాలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలు సరైన మౌలిక సదుపాయాలు లేక కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. అలాంటి పాఠశాలలకు నిధులు కేటాయించకుండా యూనియన్లకు కేటాయించడం శోచనీయమన్నారు. దీనిని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని అన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగలి వెంకట్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి సంగయ్య, రాజన్న, టీపీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజం, నాగభూషణం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును

**No. Y/C. e-Auction/HYB/2024-25**

**తేది: 16.08.2024**

PUB/0827

కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్ట్స్ మరియు NFR కాంట్రాక్ట్స్ కొరకు హైదరాబాద్ డివిజన్ ఇ-వేలంను అమలుచేసింది. తదనుగుణంగా హైదరాబాద్ డివిజన్ దిగువ కేటగిరిల కొరకు ఇ-వేలంను ప్రాసెస్ చేసింది.

| క్ర. సం. | కేటగిరి | కేటలాగ్ నం. | వివరాలు | వేలం తేది | వేలం ప్రారంభ సమయం | వేలం ముగింపు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | NFR పార్కింగ్ | HYB-PRK-NFR-RDC | తార్నాక మెట్రో సమీపాన రైల్వే డిగ్రీ కాలేజ్ వద్ద NFR పార్కింగ్ లాట్ ఇచ్చుట. | 23.08.24 | 15:00 | 15:30 |
| 2 | MSS-HYB-KCG-WstMgt-64-24-1 | | హైదరాబాద్ డివిజన్‌లో కాచీగూడ రైల్వే స్టేషన్ యొక్క స్టేషన్లు మరియు రైల్వే కాలనీ ఏరియాల నుండి (రీసైక్లబుల్స్ సేకరణ) వ్యర్థాల నిర్వహణ | | | |
| 3 | MSS-HYB-KRNT-WstMgt-65-24-1 | HYB-MSS-WM-01 | హైదరాబాద్ డివిజన్‌లో కర్నూల్ సిటీ రైల్వే స్టేషన్ యొక్క స్టేషన్లు మరియు రైల్వే కాలనీ ఏరియాల నుండి (రీసైక్లబుల్స్ సేకరణ) వ్యర్థాల నిర్వహణ | 23.08.24 | 10.00 | 10.50 |
| 4 | MSS-HYB-NZB-WstMgt-66-24-1 | | హైదరాబాద్ డివిజన్‌లో నిజామాబాద్ రైల్వే స్టేషన్ యొక్క స్టేషన్లు మరియు రైల్వే కాలనీ ఏరియాల నుండి (రీసైక్లబుల్స్ సేకరణ) వ్యర్థాల నిర్వహణ | | | |
| 5 | పార్కింగ్ | HYB-PRKG-MXT | మలక్‌పేట్ (మెయిన్) 04 స్టేషన్లు అనగా సఫీల్‌గూడ, గుండ్లపోచంపల్లి, సితాఫల్‌మండి మరియు ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల వద్ద పార్కింగ్ లాట్ ఇచ్చుట. | 28.08.24 | 10.00 | 10.30 |
| 6 | పార్కింగ్ | HYB-PRKG-038 | 03 స్టేషన్లు అనగా జమైఉస్మానియ, అక్కన్నపేట మరియు గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ల వద్ద పార్కింగ్ లాట్ ఇచ్చుట. | 30.08.24 | 11.00 | 11.50 |

A1070 సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్


# 'ఖాకీ' కలవరం.. 'నేతల' సంకటం

- **ఇరువురి మధ్య నలిగిపోతున్న పోలీసులు**
- **గీత దాటితే వేటు వేస్తోన్న 'బాస్'**
- **తమ ఆదేశాలు అమలుకాక**
- **ప్రజా ప్రతినిధుల్లో గందరగోళం**

నిజామాబాద్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. వివిధ శాఖల్లోని అధికారులకు ప్రాణ సంకటంగా మారింది. కరవమంటే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపం అన్నట్లుగా మారింది నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పని చేస్తున్న కొందరి పరిస్థితి. ఓ వైపు అధికార పార్టీ నేతల మాటను అమలు చేయలేక, పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలను కాదనలేక సతమతమవుతున్నారు. పారదర్శకంగా, రాగద్వేషాలకు అతీతంగా పని చేయాల్సిన పోలీసుశాఖలో రాజకీయ నేతల అండచూసుకొని కొంత మంది అధికారులు అమ్యామ్యాలకు అలవాటుపడుతున్నారు. మరోవైపు అధికార పార్టీ నేతల ఆదేశాలు అమలు చేస్తే ఏదో ఒక కారణంతో అటాచ్‌మెంట్లు ఎదుర్కోవడంతో పాటు బదిలీలు తప్పడం లేదు. నేతల మాటను పెడచెవిన పెడితే వారి ఆగ్రహానికి గురి కావాల్సి వస్తోంది. ఇలా అడకత్తెరలో పోక చెక్క మాదిరిగా ఖాకీలు నలిగి పోతున్నారు. డబ్బుల కోసం కక్కుర్తి పడే వారికి ఇప్పుడున్న పరిస్థితులు అనుకూలించక పోవడంతో వారంతా లూప్‌లైన్‌లో మిన్నకుంటూ సేద తీరుతుండడం గమనార్హం.

**మచ్చుకు కొన్ని..**

ఆర్మూర్‌లో ఈ మధ్యనే సీఐ రవికుమార్ బదిలీ జరిగింది. భీమ్‌గల్‌కు చెందిన ఓ అధికారికి బాధ్యతలు అప్పగించారు. రెండు రోజులకే ఈ ప్రక్రియ రివర్స్ అయ్యింది. ఏమిటా? అని ప్రశ్నిస్తే రాజకీయ పలుకుబడితో తెచ్చుకున్న పోస్టింగ్ కావడంతో రాత్రికి రాత్రే బదిలీ ఆగిపోవడం చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌కు బదిలీ చేయబడిన రవికుమార్ తిరిగి ఆర్మూర్ సీఐగా అదే కుర్చీలో ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. ఎనిమిది నెలలుగా డిచ్‌పల్లి సీఐ పోస్టు ఖాకీల్లో తీవ్ర దుమారమే రేపుతోంది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో రాజకీయ పలుకుబడితో పోస్టింగ్ తెచ్చుకున్న ఓ సీఐ ఇక్కడున్న పరిస్థితులను గ్రహించి గందరగోళానికి గురైనట్లు ప్రచారం జరిగింది. శాఖా పరమైన బదిలీల్లో డిచ్‌పల్లి సీఐగా వచ్చిన మల్లేశ్‌ను ఈ మధ్యనే ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కామారెడ్డిలో పని చేస్తున్న సీఐకి డిచ్‌పల్లి పోస్టింగ్ ఇవ్వగా కమిషనరేట్ ఉన్నతాధికారుల రంగ ప్రవేశంతో ఈ ప్రక్రియను నిలిపేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.నగరంలోని నాల్గో టౌన్‌లో నకిలీ ఎఫ్ఐఆర్ విషయంలో ఓ ఎస్సైని సీపీ కార్యాలయానికి ఉన్నతాధికారులు అటాచ్ చేశారు. కొద్ది రోజుల్లోనే సదరు ఎస్సై ఓ రాజకీయ పార్టీ నేత అండతో తిరిగి వేరే ఠాణాకు పోస్టింగ్ తెచ్చుకోవడం దుమారం రేపుతోంది. రెండో ఠాణాలో గంజాయి కేసు విషయంలో ఓ ఎస్సైపై సీపీ చర్యలు తీసుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సదరు ఖాకీకి మళ్లీ వేరే పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ రావడం గమనార్హం.తిరిగి డయల్ 100 కేసులో విధుల్లో అలసత్వం కారణంగా సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఖిల్లా గేటుకు రంగులు పూసిన కేసులో ఓ ఎస్సైపైనా గతంలో వేటు పడింది.

**జంకుతున్న పోలీసులు...**

గత ప్రభుత్వంలో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నట్లుగా నటిస్తూ పలువురు కీలక నేతలను వంచించిన పోలీస్ అధికారులు ఇప్పుడు కాంగ్రెస్ నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. నగరంలోని పలు కీలక ఠాణాల్లో పాతుకుపోయిన 2012 బ్యాచ్‌కు చెందిన పలువురు ఎస్సైలు పక్క జిల్లా నుంచి బదిలీ చేసుకుని సొంత జిల్లాకు వచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. బదిలీపై వచ్చిన వారిలో కొందరు పోస్టింగ్ కోసం అర్రులు చాచకుండా లూప్‌లైన్‌లో కొనసాగుతున్నారు. కాంగ్రెస్ నేతలు అనుకున్నది జరగకపోవడం, పలువురు కళంకిత ఖాకీలు కోరుకున్నట్లుగా పోలీస్ ఉన్నతాధికారి బదిలీ కాకపోవడంతో కథ అడ్డం తిరిగినట్లు అయ్యింది.

### నేతల కుంగుబాటు..

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఖాకీ వర్సెస్ ఖద్దర్ అన్నట్లుగా వ్యవహారం నడుస్తోంది. ఓవైపు పోలీస్ ఉన్నతాధికారులు, మరోవైపు అధికార పార్టీ నేతల మధ్య బయటపడని వైరం కనిపిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీకి చెందిన నేతలంతా తమ వారికి పోస్టింగ్ ఇప్పించుకుని పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం గతంలో తమకు సహకరించిన ఎస్సై, సీఐ, ఏసీపీ స్థాయి అధికారుల జాబితాను రూపొందించుకున్నారు. ఇందుకోసం అమ్యామ్యాలను సైతం మాట్లాడుకున్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారిని ఏరికోరి తెచ్చుకునేందుకు పలువురు సిద్ధమయ్యారు. కానీ నేతల పప్పులు ఉడకకపోవడంతో తాము అధికారంలో ఉన్నామా? లేదా? అన్న అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్నికల ముందు జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన వారంతా తిరుగు ముఖం పట్టేందుకు సాహసించడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు బదిలీ కోరుకోవడానికి సైతం బిక్కుబిక్కుమంటున్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే పోలీస్ శాఖలో విధులు సక్రమంగా నిర్వర్తించే వారికి ఏ ఢోకా లేదు. పనికి తగ్గ పోస్టింగ్ దొరకడం ఎప్పుడైనా ఖాయమే. కానీ నేతలతో అంటకాగుతూ పైరవీలతో పోస్టింగ్‌లు సంపాదించే ఖాకీలతో ఇటు పోలీస్ శాఖకు, అటు ప్రజలకు తీవ్రమైన అన్యాయం జరగడం తథ్యమన్నది ప్రజల్లో చర్చ జరుగుతోంది.

### ద్విచక్ర వాహనాల

# దొంగల అరెస్టు

### మూడు బైకులు స్వాధీనం




వివరాలను వెల్లడిస్తున్న గాంధారి ఎస్సై ఆంజనేయులు

గాంధారి, ఆగస్టు 19: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గాంధారి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మండలంలో ఇటీవల పలువురి ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పోలీసులు సోమవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం కల్లూర్ గ్రామానికి చెందిన బీర్కూర్ లింగం బాన్సువాడ నుంచి గాంధారి వైపు వస్తున్నాడు. పోలీసులు అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో అతడు అదే గ్రామానికి చెందిన సోలాపూర్ రాజుతో కలిసి బైకులను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. వారి నుంచి మూడు బైకులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.